'డికెటి' రిజిస్ట్రేషన్లకు బ్రేక్...

- రాష్ట్ర ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు
- నష్టపోనున్న రియల్టర్లు, కొనుగోలుదారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్ణయాలు తీసుకుని అమలు చేసిన అంశాలను రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన ఎన్‌డిఎ ప్రభుత్వం పునః పరిశీలిస్తోంది. వాటిలో కొన్నింటిని ఇప్పటికే రద్దు చేసింది. భూముల రీసర్వేని రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. అదేవిధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూడా రద్దు చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించింది. అదే కోవలోనే డికెటి భూముల ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లకు కూడా బ్రేక్ వేసింది. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో రియల్టర్లు, కొనుగోలుదారులు నష్టపోనున్నారు...

డికెటి భూముల ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లను ఈ నెల 19 నుంచి ఎటువంటి పరిస్థితుల్లో చేయొద్దంటూ రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు జిల్లా, సబ్ రిజిస్ట్రార్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో డికెటి భూములు కలిగి రిజిస్ట్రేషన్‌కు అర్హత పొందిన పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇదే క్రమంలోనే డికెటి భూములను తక్కువగా కొనుక్కొని వందల ఎకరాలు పోగుచేసుకుని ఫ్రీహోల్డ్ భూములను

రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి సిద్ధపడుతున్న పలువురు భూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటిదాకా తక్కువ ధరకు కొని ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్‌ల ద్వారా ధరలు పెంచుకున్న వాటిని ఎక్కడ రద్దు చేస్తారోనని పలువురు భూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం భూములు మంజూరు చేసిన తరువాత 20 సంవత్సరాల పాటు వారు ఆ భూములను అనుభవించుకుంటూ ఉన్న వాటిని ఫ్రీహోల్డ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని 2023 జులైలో అప్పటి వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వెబ్‌సైట్‌లో 21ఎ నిషేదిత జాబితాలో ఉన్న డికెటి భూముల వివరాలను తొలగించింది. ఈ అంశం ఎంత మందికి మేలు చేసిందో తెలియదు గాని చాలా మంది అప్పటి అధికార పార్టీ నాయకులను మాత్రం కుబేరులను చేసిందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను సొంతం చేసుకోవడానికి వైసిపి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అప్పట్లో రాజకియ, ఆర్థిక బలం ఉన్నవారే ఎక్కువగా వినియోగించుకున్నారనే విమర్శలు లేకపోలేదు. దీని వల్ల ప్రభుత్వ డికెటి భూములు రిజిస్ట్రేషన్ లావాదేవీలకు అర్హత సంపాదించి కోట్లకు కోట్లు సంపాదించిన వారు చాలామంది ఉన్నారు. సుమారు ఏడాదికి పైగా జరిగిన ఈ తంతులో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్షల ఎకరాలు రిజిస్ట్రేషన్లు జరిగి క్రయవిక్రయాలు బాగా పెరిగాయి. దీని వల్ల రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం కూడా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్న సన్న కారు రైతులు ఫ్రీహోల్డ్ ద్వారా అర్హత పొందిన పొలాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఎక్కువ మంది వాటిని అమ్మేసుకొని కుటుంబాల అవసరాలను తీర్చుకున్నారు. ఈ క్రమంలో పట్టణ ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు డికెటి ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ భూములను వెతికి వెతికి మరీ కొని భూవ్యాపారాలను ముమ్మరం చేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. డికెటి భూములు రిజిస్ట్రేషన్‌కు అర్హత పొందిన కొంతమంది చిన్న సన్నకారు రైతులు అవకాశాన్ని వినియోగించుకోలేక నష్టపోయామని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ అంశాన్ని పునఃపరిశీలించి పటిష్టంగా అమలు చేసి అర్హత పొందిన డికెటి భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెసులు బాటు కల్పించాలని కోరుతున్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రాధాన్యత

- 15 రోజులకోసారి ట్యాంకుల క్లోరినేషన్- జడ్‌పి ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు
- ప్రజాశక్తితో జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఉన్నతాధికారుల సలహాలతో మరింత అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాసర రెడ్డి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామాల సమస్యలు అన్నీ పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిర్ణయాలు అమలు చేసి అభివృద్ధి సాధిస్తామని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మట్లాడారు..

ఉమ్మడి జిల్లాలోని మండలాల్లో సమస్యలను ఎలా అధిగమిస్తున్నారు?

సిఇఒ : ఉమ్మడి జిల్లాలోని మండలాల్లో నంద్యాల జిల్లాలోని మండలాల్లో డిప్యూటీ సిఇఓ ఆధ్వర్యంలో కార్యకలాపాలు చూస్తారు. అన్ని మండలాల అభివృద్ధికి ఉన్నతాధికారుల సూచనలతో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేస్తున్నాము.

అతిసార వ్యాధితో ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. దీనిపై ఏమి చర్యలు తీసుకున్నారు?

సిఇఒ : ఉమ్మడి జిల్లాలో అతిసార వ్యాధితో కాస్త ఇబ్బంది పడ్డారు. కర్నూలు జిల్లాలో మంత్రాలయం మండలం సుంకేరి గ్రామంలో, నంద్యాల జిల్లా చాబోలులో అతిసార వచ్చింది. వెంటనే చర్యలు తీసుకుని వైద్యాన్ని అందించాము. ఆ తరువాత ప్రతి పంచాయతీలో 15 రోజులకు ఒకసారి ట్యాంక్‌లను క్లోరినేషన్ చేసేలా చర్యలు తీసుకున్నాము. ఖచ్చితంగా ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నాము. స్వచ్ఛమైన తాగునీరు అందించడం గ్రామపంచాయతీల ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని నిర్దేశించాం.

జిల్లా పరిషత్ ఆర్థిక అభివృద్ధి ఎలా ఉంది. పాత భవనం టూరిజంకు అద్దెకు ఇస్తున్నారా?

సిఇఒ : జిల్లా పరిషత్ ఆదాయం ఎమ్మిగనూరు కాంప్లెక్స్, స్కూల్ బిల్డింగ్, శ్రీశైలంలో గెస్ట్ గౌస్, ప్రధాన కార్యాలయంలో సెల్ టవర్, హోర్డింగ్స్ ఇలా వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేస్తున్నాము. అనుకున్న స్థాయిలో నిధులు లేకవడం వల్ల కొంత మేర నష్టం కూడా జరుగుతుంది. పాత భవనం నిర్వహణ మరింత నష్టంగా ఉంది. అందుకు గాను టూరిజం వారు అద్దెకు అడిగారు. వారికి కేటాయించాలని సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు.

ఎలాంటి ఆదాయం సమకూరితే బాగుంటుంది అనుకుంటున్నారు?

సిఇఒ : జిల్లా పరిషత్‌కు వచ్చే మైనింగ్ సెస్సు, సినరెస్టు ఆదాయం, పంచాయతీలకు రావాల్సిన ఆదాయం వస్తే మరింత ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుండి తోడ్పాటును అందివ్వాలని, నిధులు ఇవ్వాలని తీర్మానం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఆదాయాన్ని చేకూర్చేల చర్యలు తీసుకుంటాం.

జిల్లా పరిషత్ పరిధిలో పని చేసేవారికి ఎవరెవరికి పదోన్నతులు కల్పించారు?

సిఇఒ : జిల్లా పరిషత్ పరిధిలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి దాకా కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్ 6, టైపిస్టు 3, ఆఫీస్ సబార్డినెట్ 10, ఇందులో ప్రమోషన్స్ జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు నుండి సీనియర్ అసిస్టెంట్‌గా 13, సీనియర్ అసిస్టెంట్ నుండి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా 10 మందికి పదోన్నతులు కల్పించాము.

జిల్లాలోని పంచాయతీల అభివృద్ధికి మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

సిఇఒ : ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు వారి సలహాలు సూచనలతో వారు అందించే ప్రోత్సాహంతో పంచాయతీల అభివృద్ధికి వారి నిర్ణయాల మేరకు మరింత ప్రగతి సాధిస్తాం. ఆ దిశగా వారికి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేసేలా వారికి నివేదిస్తాము.

రేషన్ కార్డుదారులకు భరోసా ఏది

-మూడు రకాల వస్తువులు మాత్రమే సరఫరా
-సబ్సిడీతో నిత్యవసర వస్తువులు ఇవ్వాలి
-కార్డుదారుల నుంచి డిమాండ్

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మార్కెట్లో ఏ నిత్యవసర వస్తువు కొనుగోలు చేసినా ధరలు అధికంగా ఉండడంతో తప్పని పరిస్థితిలో కొనాల్సి వస్తుంది. ఆహార భద్రత చట్టం ఉన్నప్పటికీ రేషన్ కార్డుదారులకు మాత్రం భరోసా దక్కడం లేదు. కార్డుదారులకు కేవలం ప్రభుత్వం రేషన్ బియ్యం మాత్రమే ఉచితంగా అందజేస్తుండగా అప్పుడప్పుడు కందిపప్పు చక్కెర కూడా అందజేస్తుంది. సబ్సిడీ కింద నిత్యవసర సరుకులు అందజేయాలని కార్డుదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం 1228 రేషన్ షాపులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 6,76,209 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు బియ్యం మాత్రమే సరఫరా చేస్తున్నారు. రాగి పిండి చక్కర కందిపప్పు కొంతమంది కార్డుదారులకు మాత్రమే సరఫరా జరుగుతుంది.. పూర్తిస్థాయిలోనే కార్మిదారులందరికీ నిత్యాసర సరుకులు అందడం లేదు. ఆగస్టు నెల నుండి కార్డుదారులందరికీ సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరా శాఖ ప్రకటించింది. గతంలో కొంతమంది కార్డుదారులకు సరఫరా చేసి చేతులెత్తేసిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి కార్డుదారులందరికీ సరఫరా చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో నిత్యాసర వస్తువులు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిత్యవసర సరుకులు ధరలు

పెరిగిపోవడం మూలంగా పేదలు ప్రతినెలా నిత్యవసర సరుకుల కోసం కొనుగోలు చేయాలంటే జేబులు ఖాళీ అవుతున్న పరిస్థితి ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో రేషన్ సరుకుల పైనే ఆధారపడి అనేకమంది నిరుపేదలు జీవనం కొనసాగిస్తున్నారు. గతంలో తెల్ల కార్డుదారులందరికీ రేషన్ షాపుల ద్వారా బియ్యం కందిపప్పు వంట నూనె చక్కెర పసుపు సబ్బులు ఇతర వస్తువులను సబ్సిడీ కింద అందజేసేవారు. గత ప్రభుత్వ హాయంలో కేవలం రేషన్ బియ్యంతో సరిపెట్టి కార్డుదారులకు ఎలాంటి నిత్యవసర వస్తువులను సరఫరా చేయలేదు. సబ్సిడీ కింద నిత్యవసర వస్తువులను అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

14 రకాల నిత్యవసర వస్తువులు ఇవ్వాలి

కె.వి నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి వ్యవసాయ కార్మిక సంఘం

రేషన్ కార్డుదారులకు కేరళ ప్రభుత్వం తరహాలో 14 రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాలి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆహార భద్రత చట్టానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం నిధులను కోత విధించింది. కేంద్ర ప్రభుత్వానికి ఆహార భద్రత చట్టం అమలులో ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. అవసరమైతే కార్డుదారులకు ప్రతినెలా సబ్సిడీ నిర్ణయించి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలి.

సబ్సిడీ ద్వారా నిత్యవసర వస్తువులు అందజేయాలి

కె. బలరాం అధ్యక్షుడు ప్రజా పరిరక్షణ సమితి

నిరుపేద కార్డుదారులకు రేషన్ ద్వారా ప్రతినెల సబ్సిడీ కింద నిత్యవసర వస్తువులను అందజేసేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే పెరిగిన నిత్యవసర ధరల వల్ల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్డుదారులందరికి నిత్యవసర సరుకులన్నీ సబ్సిడీ ధరలకే ఇవ్వాలి.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

సూసైడ్ నోట్లో రాసిన విద్యార్థి

ప్రజాశక్తి కర్నూల్ కలెక్టరేట్

ట్రిబుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి సాయికార్తీక్ నాయుడు ఒంట రితనం భరిం చలేక ఆత్మహత్య చేసు కున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసు కున్నాడని పోలీసు అధికారులు వెల్లడించారు. ఆదివారం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థి సాయి కార్తీక్ నాయుడు మృతదేహానికి శవపరీక్షలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యా సంస్థ డీన్ సత్యబాబు అక్కడ విద్యార్థి తల్లిదండ్రులతో పోలీసులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్య ఘటనపై పోలీసులు విస్తృతంగా విచారణ చేస్తున్నారు. విద్యార్థి ఒంటరిగానే తరగతి గదిలో గడంతోపాటు స్నేహితులతో అంతగా కలిసేవాడు కాదని తోటి విద్యార్థులు తమ దృష్టికి తీసుకు వచ్చారు. విద్యార్థి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారన్నారు. విద్యార్థి తండ్రి వెంకట్ నాయుడు మాట్లాడుతూ గత వారం రోజుల క్రితమే సెలవులు ముగించుకొని తరగతులకు ఇక్కడికి వచ్చారన్నారు. కేవలం గదిలో కూడా ఒంటరిగానే ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. చేతికి వచ్చిన కుమారుడు పోవడం భరించలేని బాధగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమస్యాత్మక ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్

22 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్ : కర్నూలు జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆదోని,కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు బృందాలుగా ఏర్పడి ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ దాడులు నిర్వహించారు.

కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో: కర్నూలు డిఎస్‌పి విజయశేఖర్ ఆధ్వర్యంలో కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎలాంటి ధృవ పత్రాలు లేని 19 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, కర్నూలు 4వపట్టణ సిఐ శంకరయ్య , కర్నూలు రూరల్ సిఐ కిరణ్ కుమార్ రెడ్డి, కోడుమూరు సిఐ మన్సూరుద్దీన్, సెబ్ పోలీసులు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, జావేద్, ఎస్ఐలు, ఆర్

శరీన్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎస్ఐలు, 100 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఆదోని సబ్ డివిజన్ లో: ఆదోని డిఎస్‌పి శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఆదోని మూడవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని అరుణ్ జ్యోతి నగర్‌లో దాడులు నిర్వహించారు. ఒకరిని అదుపులోకి తీసుకుని , 253 కర్ణాటక మద్యం టెట్రాప్యాకెట్లను(రూ. 22 వేలు) , ఎలాంటి ధృవపత్రాలు లేని 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదోని పట్టణ సిఐలు ఆదోని ఒకటవ పట్టణ సిఐ తేజమూర్తి, ఆదోని టు టౌన్ సిఐ గోపి , ఆదోని త్రీ టౌన్ సిఐ నరసింహారాజు, ఆదోని తాలుకా సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులతో శమంతకమణి, కోచ్‌లు

ఒలింపిక్ గుర్తింపు ఉన్న క్రీడల్లో సాధన

- శమంతకమణి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్
- రాష్ట్ర తైక్వాండో కు ఎంపికైన క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

తైక్వాండో సాధన వల్ల విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని, ప్రతి విద్యార్థి ఒలింపిక్ గుర్తింపు ఉన్న క్రీడల్లో సాధన చేయాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి అన్నారు. రాయలసీమ ఫిట్నెస్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకులు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి టిజి. భరత్ జన్మదినాన్ని స్థానిక కిడ్స్ వరల్డ్ లో ఆదివారం క్రీడాకారుల సమక్షంలో కేక్ కట్ చేసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా తైక్వాండో విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరయిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి, ఉచిత న్యాయ సలహాకేంద్రం నిర్వాహకులు న్యాయవాది ఎం.శ్రీధర్, కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు విద్యార్థులను పరిచయం చేసుకొని వారికి మార్గదర్శనం చేశారు. ఆగస్టు 2,3,4 తేదీలలో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పథకాలను, ప్రశంసా పత్రాలను అందజేసి విజయంతో తిరిగి రావాలని ఆశీర్వదించారు. తైక్వాండో జిల్లా ఇంచార్జ్ మాస్టర్ సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమేశ్వరి, వీరేష్ బాబు, కామర్తి భరత్,వీరేష్ రావు, గోపి చౌదరి, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆహారం తయారీలో నాణ్యత లోపించరాదు

ఇన్‌చార్జి విసి ఎన్‌టికె నాయక్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు ఆహారం తయారీలో నాణ్యత లోపించకుండా చూడాలని వర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె.నాయక్ ఆదేశించారు. ఆదివారం రాయలసీమ వర్సిటీలోని పురుషుల హాస్టల్ వంటశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంట చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఉన్నత విద్య అభ్యాసం కోసం సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి విద్యార్థులు వస్తుంటారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని తయారుచేసి వడ్డించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి వర్సిటీకి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. రాయలసీమ విశ్వవిద్యాయంతోపాటు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కూడా మంచి పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. అధ్యయనానికి తగిన సమయం కేటాయించాలని సూచించారు. ఆయన వెంట ఇన్చార్జ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు హాస్టల్ వార్డెన్లు సిబ్బంది ఉన్నారు.

బీడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో బీడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని బీడీ అండ్ సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పి.ఎగ్బాల్ హుస్సేన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కార్మిక కర్షక భవన్ లో జరిగిన బీడీ కార్మికుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ, బీడీ కార్మిక సంఘం నాయకులు కె. సధాకరప్ప, ఎస్.అబ్దుల్ దేశాయ్‌మాట్లాడారు. దేశంలో రాష్ట్రంలో బీడీ కార్మికులకు రావలసిన కనీస వేతనం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ అధికారులు వాళ్ల వేతనాల గురించి, అగ్రిమెంట్ల గురించి పట్టించుకోవడం లేదన్నారు. బీడీ ఖార్ఖాన యజమానులు బీడీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా మేము ఇస్తుంది తీసుకోవాలని కార్మికులను బానిసలుగా చూస్తున్నారని అన్నారు. యజమానులు బీడీ కార్మికుల శ్రమను దోపిడి చేస్తూ లాభపడుతున్నారని కర్నూలు జిల్లాలో బీడీ కార్ఖానాలో దాదాపు 5వేల మంది కార్మికులు బీడీ ఆకు, పొగాకు తీసుకుని వాళ్ళ ఇండ్ల దగ్గర పోయి ఉదయం నుండి సాయంత్రం వరకు కుటుంబ సభ్యుల సహకారంతో బీడీలు అతి కష్టంమీద తయారు చేయడానికి యజమానులు బీడీ కార్మికులకు తగ్గట్టు ఆకు పొగాకు

మాట్లాడుతున్న ఎక్బాల్ హుస్సేన్

వేయడం లేదన్నారు. కార్మికులు వెయ్యి బీడీలకుగాను రూ. 40 ఆకూ పొగాకు కొనాల్సిందేనన్నారు. వేయి బీడీలు యజమాని దగ్గరకు తీసుకొని వెళ్ళితే బీడీలు బాగా లేవని రెండు వందల బీడీలు దాకా తీసేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాల చట్టం ప్రకారం వెయ్యి బీడీలకు రూ.450 ఇవ్వాలి. నెల్లూరు, తాడిపత్రి, కదిరి,కడప జిల్లాలో వెయ్యి బీడీలకు రూ.250 నుండి రూ.300 వరకు ఇస్తున్నారన్నారు.కర్నూల్ నగరంలో యజమానులు లేబర్ అధికారులతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం వెయ్యి బీడీలకు గాను రూ.190 ఇవ్వాలి , చాలా కార్ఖానలో వెయ్యి బీడీలకు రూ.150 నుండి 170 రూపాయలు ఇస్తున్నారని తెలిపారు. బీడీ కార్మికులకు యజమానులు అగ్రిమెంట్ ప్రకారం వెయ్యి బీడీ లకు రూ.190 ప్రకారం ఇచ్చే విధంగా జిల్లా కార్మికశాఖా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేదంటే భవిష్యత్తులో బీడీ కార్మికులను సమీకరించి కనీస వేతనాలు ఇచ్చేవరకు ఆందోళనలు చేస్తామని కార్ఖానా యజమానులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు .కర్నూలు జిల్లాలోని బీడీ కార్మికులు కనీస వేతనాలు సాధనకు ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు.

హెల్త్ సెక్రెటరీలను మెడికల్ అండ్ హెల్త్ పరిధిలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హెల్త్ సెక్రెటరీలను వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోనికి తీసుకొని వస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఎపి యునైటెడ్ గ్రామ , వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు కార్మికకర్షక భవన్‌లో జిల్లా నాయకులు మహేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలను సీనియారిటీ లిస్టు తయారుచేసి అందరికీ ఎంపిహెచ్ఎ (ఎఫ్) ప్రమోషన్లు కల్పించాలని కోరారు. హెల్త్ సెక్రటరీస్ ఫీల్డ్ వర్క్ చేయాల్సి ఉన్నందున బయోమెట్రిక్ నుండి వెసులుబాటు కల్పించాలని కోరారు. మాతా శిశు సంరక్షణ సేవలను (యానిమల్, ఆర్‌సిహెచ్, యూనియన్) మూడు యాప్‌లలో అప్లోడ్ చేయాల్సి వస్తుందని, దీనివలన చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అందువల్ల ఒకే యాప్‌లో ఒకేసారి చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ సెక్రటరీలకు సాధారణ బదిలీలను కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రటరీలకు జాబ్ చార్టులో ఉన్న పనులు కాకుండా అదనపు పనులను కార్యక్రమాలను ఇవ్వడాన్ని మానుకొని పని భారాన్ని తగ్గించాలని కోరారు. కొత్త ప్రోగ్రామ్స్ ఏవైనా వచ్చినప్పుడు ఫిజికల్ గా ట్రైనింగ్ ఇవ్వాలని కోరారు. అలా కాకుండా ఫీల్డ్ లెవెల్ లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు అధికారులు హెల్త్ సెక్రటరీలను బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

మాట్లాడుతున్న సంధ్యారాణి

.హెల్త్ సెక్రటరీలకు సెలవులు మంజూరు చేయడానికి హెల్త్ డిపార్టుమెంట్ పంచాయతీరాజ్ డిపార్టెంట్లను సంప్రదించాల్సి వస్తుందని, అలాకాకుండా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోనే సెలవు మంజూరు చేయడానికి కృషి చేయాలని కోరారు. హెల్త్ సెక్రటరీలకు రావాల్సిన అన్ని అలవెన్సులు రాష్ట్ర వ్యాప్తంగా ఒకేలాగా అమలుపరచాలని, యూనిఫామ్‌లు ఎవిడి ట్యూషన్ ఫీజులు, ఇంక్రిమెంటు , ఏరియర్స్ అన్నీ కూడా అమలు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మన సమస్యలు పరిష్కారం కోసం ఆందోళన చేయడం తప్ప వేరే మార్గాలు లేవని, ఐక్యమత్యంతో అందరూ కలిసి ఉద్యమాలు చేసినప్పుడు మాత్రమే మన సమస్యలు పరిష్కరించుకోగలమని అన్నారు. ఈ సమావేశంలో దేవి, లావణ్య, చాముండేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ గ్రామ , వార్డు హెల్త్ సెక్రటరీ జిల్లా కమిటి ఎన్నిక

జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎండి అంజిబాబు, జిల్లా అధ్యక్షురాలుగా మహేశ్వరమ్మ, జిల్లా కార్యదర్శిగా సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలుగా లావణ్య, జిల్లా సహాయ కార్యదర్శిగా చాముండేశ్వరి, జిల్లా కోశాధికారిగా దేవి , జిల్లా కమిటీ సభ్యులుగా సుగుణమ్మ ,యశోద, హైమావతిలను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి సంధ్యారాణి తెలిపారు.

అవగాహన కార్యక్రమానికి వచ్చిన వారితో మహిళా పోలీసు అధికారులు

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

మహిళా పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో మహిళా పిఎస్ డిఎస్‌పి జె. బాబు ప్రసాద్ పర్యవేక్షణలో మహిళా పిఎస్ సిఐ టి.అబ్దుల్ గౌస్, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐలు కలిసి నూతన చట్టాల పై మహిళా పోలీసు స్టేషన్‌లో ఆదివారం మహిళా పోలీసులకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జులై ఒకటి నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత , భారతీయ నాగరిక్ సురక్ష సంహిత , భారతీయ సాక్ష్యా అధినియం కొత్త, పాత చట్టాలలో మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజు ల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలో తెలియజేశామన్నారు. ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలని తెలియ చెప్పారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని మహిళా పిఎస్ పోలీసు అధికారులు మహిళా పోలీసులకు తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-సి బెళగల్

గతేడాది జులై 1 న అమలు లోకి వచ్చిన నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. కొత్తచట్టాలపై ఆదివారం సిబెళగల్ స్టేషన్‌లో ఆయా పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, ఇతర మేధావులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇది వరకు ఐపిసి, సిపిసి కోడ్‌ల మీద ఆయా సెక్షన్ పెట్టి కేసులు అయ్యేవని అన్నారు. ఇకపై భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అభినయం వంటివీ అందుబాటులోకి వచ్చాయన్నారు. చట్టాలను తెలుసుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు.

చిన్నహోతూరులో గుర్తుతెలియని మృతదేహం

- డ్రమ్ములో పెట్టి సీల్ చేసిన వైనం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న హోతూరు పొలమేరలో ఆదివారం ఓ వ్యక్తిని చంపి డ్రమ్ములో సీలు చేసి వేసిన సంఘటన సంచలనంగా మారింది. ఆస్పరి సిఐ హనుమంతప్ప తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నహోతూరు గ్రామానికి చెందిన జనార్ధన్ అనే బర్రెల కాపరి మధ్యాహ్నం బర్రెలు మేపుతుండగా ఆలూరు వైపు నుండి సిటీ ఆటో మాగప్ప బావి వంక దగ్గర ముళ్లపదల్లో డ్రమ్మును పడేసి వెళ్లి పోయారు. ఆ వ్యక్తి డ్రమ్ము దగ్గరకు వెళ్లి చూడగా దుర్వాసన, మనిషి వెంట్రుకలు కనపడడంతో సిఐ హనుమంతప్పకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సిఐ.హనుమంతప్ప సంఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని బయటకు తీసి చూడగా పురుషుని మతదేహం అని గుఇర్తంచారు. రెండు,మూడు రోజుల క్రితం వ్యక్తిని చంపి సంచిలో మూట కట్టి డ్రమ్ములో వేసి సీల్ చేశారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తిని చంపి ఇక్కడ పారవేసి పోయినట్లు కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఎస్పి బిందు మాధవ్ కు సమాచారం ఇచ్చామన్నారు.ఎస్పి స్పందించి క్లూస్‌టీం, డాగ్స్ వర్డ్ టీమ్‌ను చిన్నహోతూరు గ్రామానికి పంపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనసేనలోకి 200 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండ ఎస్సీ కాలనీలో ఆదివారం జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆలూరు జనసేన పార్టీ ఇన్చార్జి తెర్నేకల్ వెంకప్ప సమక్షంలో చంటిబాబు, డీజే రంగస్వామి, ముక్కెళ్ల గబ్బర్ సింగ్ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకోవాలని దీని ద్వారా రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తాను అన్ని వేళలో ముందు ఉంటానన్నారు. దేవనకొండలో డిఎన్‌టి హాస్టలు, మోడల్ స్కూలు ఏర్పాటుకు, విద్యార్థుల ఆటస్థలం, వలసల నివారణకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండలంలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్నా మౌలిక సదుపాయాల కల్పనకు పాలకులతో అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ కొత్తపేట వీరేష్, వీర మహిళ సరోజ, మండల నాయకులు జగదీశ, ఉచీరప్ప, రామాంజనేయులు, ఆంటోని, నందు, ముత్యాల రాముడు, భంగిమల్లయ్య పాల్గొన్నారు.

శుద్ధమైన నీటిని అందించడమే లక్ష్యం

- బంటనహాల్ సర్పంచ్ సుశీలమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామ ప్రజలకు కలుషితం లేని శుద్ధమైన నీటిని అందించడమే తమ కర్తవమని బంటనహాల్ సర్పంచ్ సుశీలమ్మ తెలిపారు. ఆదివారం బంటన హాల్ గ్రామంలో ప్రజలకు ప్రతిరోజు మంచినీటి సరఫరా చేసే పంప్ హౌస్‌ను పంచాయతీ కార్మికుల చేత దగ్గరుండి క్లీన్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంప్ హౌస్ లోన గోడలకు ఇరువైపులా ఉన్న పాచిని కింది భాగంలో ఉండిపోయిన వండును లిక్విడ్, బ్లీచింగ్ పౌడర్ ద్వారా క్లీన్ చేయించిన అనంతరమే మంచినీటిని ప్రజలకు అందిస్తున్నామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల పరిష్కరించడానికి ఎప్పటికప్పుడు గ్రామాధికారుల చేత మాట్లాడుతూ పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా సీజినల్ వ్యాధులకు తావు లేకుండా ప్రతి వీధిలో కూడా మురుగునూరు, పరిసరాలను పంచాయతీ కార్మికుల చేత ఎప్పటికప్పుడు క్లీన్ చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నామన్నారు. సర్పంచ్ తనయుడు సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు సాగునీరు సరఫరా చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి మండలంలో గురు రాఘవేంద్ర పులికనుమ ప్రాజెక్టులకు తుంగభద్రా నది నుండి నీటిని సరఫరా చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ సిఐటియు కోసిగి మండల కార్యదర్శి రాముడు ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. మండలంలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో అరకొర వర్షాలకు రైతులు వేసిన పంటలు దెబ్బతింటున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పైప్రాంతంలో కురిసిన అధిక వర్షాల వల్ల తుంగభద్రా నదికివరద నీరు అధికంగా చేరడంతో తమ పంట పొలాలకు సాగునీరు అందుతాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తుంగభద్ర నది నుండి కోసిగి మండలంలోని గురు రాఘవేంద్ర పులికనుమ ప్రాజెక్టులకు నీటిని సరఫరా చేసి మండలంలో రైతులకు సాగునీరు అందించాలని వారు కోరారు.

వైసిపి కార్యకర్తల కుటుంబాలకు బుట్టా రేణుక పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త పల్లెన్న, కనకవీడు గ్రామానికి చెందిన కార్యకర్త జైన్‌పోగు సత్యరాజు గుండెపోటుతో ఆకాలమరణం చెందిన విషయాన్ని తెలుకొన్న వైసిపి ఇన్‌ఛార్జ్ బుట్టా రేణుక చిత్రపటానికి పూలమాలవేసి, మరో చోట మృతదేహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పి, కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని భరోసా నిచ్చి, కనకవిడులో సత్యరాజ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రత్రూల్, వైసిపి సీనియర్ నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, శివారెడ్డి,గౌడ్, గడ్డం నారాయణ రెడ్డి, వీరుపాక్షి రెడ్డి, పేట శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, చిరుచైతన్యరెడ్డి, గ్రామవైసిపి సిపినాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానపీఠమెక్కిన సినారే ఖ్యాతి

ప్రజాశక్తి -కర్నూల్ కల్చరల్

భారతీయ సాహిత్యంలో సినారే ఖ్యాతి జ్ఞానపపీఠమెక్కిందని, తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ అవార్డు అందుకున్న ఇద్దరు కవులు డాక్టర్ సి.నారాయణరెడ్డి ఒకరు కావటం తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవమని టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో నాటకవారంగా మార్చిన సందర్భంగా డాక్టర్ సి.నారాయణరెడ్డి 94వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా, రచయిత గద్వాల వీరన్న, జిల్లా నాటక రంగం అధ్యక్షులు గుర్రపుశాల అంకయ్య, క్రిస్టఫర్, దస్తగిరి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. అనంతరం సి.నారాయణ రెడ్డి రచించిన సినిమా పాటలు గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థినులతో నత్య ప్రదర్శనలు నిర్వహించారు.

కౌసల్య సుప్రజా రామ నాటక ప్రదర్శన

ఆదివారం నాటక ప్రదర్శనలో భాగంగా సాయి ఆర్ట్స్ కొలకలూరు, గుంటూరు జిల్లా కళాకారులు గోపరాజు విజయ్ దర్శకత్వంలో కౌసల్యా సుప్రజా రామా నాటకాన్ని ప్రదర్శించారు. అలనాడు రాముని క్షేమాన్ని కోరుతూ భర్త దశరథుని ఆజ్ఞను జవదాటలేని కౌసల్య ఏ విధంగా కష్టాలు పడిందో ఈ కాలంలో కూడా కౌసల్య వంటి స్త్రీలు కుమారులు ఎక్కడో అమెరికాలో ఉంటే భర్తను వదిలిపెట్టలేక కుమారులకు దూరం కాలేక సతమతమవుతున్న కౌసల్య లాంటి తల్లుల చరిత్ర ఈ నాటకం ఇందులో గోపరాజు, విజయ్‌తో పాటు సురభి ప్రభావతి పి. విజయ్ తదితరులు నటించారు. ఈ సందర్భంగా గోపరాజు విజయ్ దర్శకుని రూ.20 వేల పారితోషికంతో పాటు సత్కారం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం సభ్యులు కె. బాల వెంకటేశ్వర్లు సంఘ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పత్తి ఓబులయ్య

నిండు కుండలా తుంగభద్ర

- 38 గేట్ల ద్వారా దిగువకు నీరు

ప్రజాశక్తి - హోళగుంద/కౌతాళం

ఎగువన కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద ప్రవాహం పోటెత్తింది. తుంగభద్ర డ్యాం నుంచి 38 గేట్ల ద్వారా 1,56,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 1,46,288 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా జారీ చేశారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 105 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుత జలాశయ నీటి మట్టం 1631.98 అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 11,425 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉండేదని బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే వరద ద్వారా వచ్చే నీటిని పూర్తిగా దిగువకు విడుదల చేస్తామని బోర్డు అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులను, మేకలను నది తీర ప్రాంతాలకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కౌతాళం మండల పరిధిలోని మెలిగనూరు, నది చాగి, కుంభల నూరు, కుమ్మలనూరు క్యాంపు, మురళి, గుడి కంబళి గ్రామాల పరిధిలో పొలాలు నీట మునిగాయి. కొంతమంది రైతుల విద్యుత్ మోటర్లు నీట మునిగాయి. వరద నీటి ద్వారా వచ్చే చెత్త చెదారం తెప్పలు పంట పొలాల చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రం దేవనకొండలో సంక్షేమ హాసళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడుతూ దేవనకొండ మండల కేంద్రాల్లో మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ బాయ్స్, గర్ల్స్ హాసళ్లను ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత చదువులు కోసం దోహదపడాలని వారు డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ప్రధానంగా వలసలకు నిలయంగా ఉంటుందని, అలాంటి కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు హాస్టల్ లేక వాళ్ళ తల్లిదండ్రుల వెంట వలసలకు వెళ్తున్నారని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి హాస్టళ్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవితేజ, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అబ్దుల్లా

ఆదమరిస్తే అంతే...

- ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణం

ప్రజాశక్తి - ఆస్పరి

ఏమాత్రం ఆదమరిచినా కూలీల ప్రాణాలు గాలిలోకి కలిసి పోతాయి. అలా ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆస్పరితో పాటు చిన్న హెూతురు, పెద్ద హెూతురు, జొహరపురం తదితర గ్రామాల నుంచి దేవనకొండకు కూలీ పనులకు వెళ్తారు. ఆటో డ్రైవర్ పరిమితికి మించి బాడుగ కోసం ఎక్కువ మంది కూలీలను ఆటోలలో కింద పైన కూర్చొ బెట్టుకొని వెళ్తున్నారు. గతంలో కూడా ఇలాగే ఆటోలో కింద పైన కూర్చొ బెట్టుకొని దేవనకొండకు కూలీ పనులకు వెళ్తూ ఆస్పరి సాయి బాబా టెంపుల్ దగ్గర ప్రమాదానికి గురై ఆటోలో ఉన్న కూలీలకు కాలు, చెయ్యి, నడుము విరిగిన సందర్భాలు లేకపోలేదు. పోలీస్ వారు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎన్ని నిబంధనలు పెట్టిన వాహనా దారులు పాటించడం లేదు. ఆస్పరి అంబేద్కర్ సర్కిల్లో పోలీస్ అధికారులు తనిఖీలు చేపట్టక పోవడంతో వాహన చోదకులు ఇష్టానుసారంగా సారంగా వెళ్తున్నారు. సాయంత్రం అయితే యువకులు స్పోర్ట్స్ బైక్ నడిపినట్లు రోడ్డుపై నడుపుతూ లారీలను క్రాస్ చేస్తు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వాహనాలు తనిఖీ చేసి నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను కోరుతున్నారు.

ఆటోలో కింద పైన కూర్చొని వెళ్తున్న కూలీలు

చేతకాని హామీలతో ప్రజలను మోగించారు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మంత్రాలయం

టిడిపి చేతకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కగానే చేతులెత్తేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు ఆశ చూపి అధికారంలోకి రాగానే అమలు చేయలేమంటూ చేతులెత్తేశారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయలేక ప్రజలు, వైసిపి నాయకులు ప్రశ్నించకూడదనే ఉద్దేశంతో అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వాలంటీర్లను విమర్శించిన చంద్రబాబు ఎన్నికల సమయంలో జీతాల పెంపు పేరుతో రోడ్డున పడేశారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ శాంతి భద్రతల పైదృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాల నాగి రెడ్డి

అనాథ పిల్లలకు దూదేకుల సంఘం చేయూత

ప్రజాశక్తి - ఆదోని

ఆలూరు తాలూకా హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన దూదేకుల ఖాసీంసాబు, షేకమ్మ దంపతులు మృతి చెందడంతో వారి ముగ్గురు కుమార్తెలు అనాథలుగా మిగిలారని దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, తెలుగు రైతు సంఘం జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా తెలిపారు. ఆదివారం గూళ్యం గ్రామంలో కుటుంబాన్ని పరామర్శించి రూ.1.05 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ దూదేకుల కాసింసాబ్ దంపతులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో అన్ని విధాలుగా ఆదరణ కోల్పోయిందని వారికి అండగా ఉండేందుకు మానవతావాదులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మొదటి కుమార్తె అసాబికి 15 ఏళ్లు వచ్చినా మానసికంగా ఎదుగుదల లేదని, రెండో కుమార్తె సబియాకు పదేళ్లు, మూడో కుమార్తె ఆఫ్రిన్‌కు ఎనిమిదేళ్లు అని తెలిపారు. నాలుగేళ్ల కిందట తండ్రి ఖాసీంసాబు అనారోగ్యంతో మృతి చెందారని, తల్లి షేకమ్మ కూలి పనులకు వెళ్తూ బతుకుబండిని నడిపిస్తూ వచ్చారని వివరించారు. ముగ్గురు కుమార్తెలను కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చారని, ఇటీవల తల్లి షేకమ్మ అనారోగ్యంతో మృతి చెందారని, దీంతో ఆ ముగ్గురు బాలికలు రెక్కలు తెగిన పక్షుల్లా విలవిల్లాడుతున్నారని, నా అనేవారెవరూ లేక వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. రెండో కుమార్తె సబియా తల్లితో పాటు కూలి పనులకు వెళ్లేదని ఇప్పుడు కుటుంబ బాధ్యత ఆమెనే మోయాల్సిన పరి స్థితి ఏర్పడిందన్నారు. దూదేకుల సంఘం తరపున తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని, ముఖ్యంగా చదువుకోడానికి సిద్ధంగా ఉన్న కాసిం సాబ్ రెండవ కుమార్తె సబియా, మూడో కుమార్తె ఆఫ్రిన్లకు ఉన్నత విద్య అందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రిటైర్డ్ తాసిల్దార్ షేక్షావలి, దూదేకుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాబు సాబ్, జిల్లా నాయకులు కాసిం సాబ్, పీరు సాబ్, ఇసివి షేక్షావలి సాబేష్ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న సాయిబాబు

సంక్షేమ హాస్టల్లో సమస్యల ఏకరువు

- వేధిస్తున్న సిబ్బంది కొరత - విద్యార్థులకు వసతులు నిల్

ప్రజాశక్తి - ఆస్పరి

పేద విద్యార్థులకు చదువులకు కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఆటంకం కారాదనే ఆలోచనతో ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టల్లో సమస్యలు తిష్ట వేశాయి. హాస్టల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రభుత్వాల సంకల్పం వసతులు లేమి కారణంగా నీరు గారి పోతోంది..

మండల కేంద్రమైన ఆస్పరిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో సమస్యలు నెలకొన్నాయి. బాలుర వసతి గృహంలో 24 మరుగుదొడ్లు ఉన్నప్పటికీ కొన్నిటికి తలుపులు లేక ఉపయోగంలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబైటే స్నానం చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుండి వంట మనిషి కూడా లేకపోవడంతో కమాటితోనే వంట చేయిస్తున్నారు. హాస్టల్లో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. కనీసం ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు కూడా తమ ఇంటి నుండే తెచ్చుకుంటున్నారు. బట్టలు,స్నానం చేయడానికి సరిపడా నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. హాస్టల్లో బోరు ఉన్నా నీళు రాకపోవడంతో గత కొన్ని రోజుల క్రితం హాస్టల్లో నీటి సమస్య ఉందని గ్రామ సర్పంచ్ మూలింటి రాధమ్మ దృష్టికి తీసుకెళ్లగా వేంటనే స్పందించి బోరు మోటర్‌ను కడిగించి పైపులు వేయడంతో కొద్దిపాటి నీళ్ళు వచ్చాయి. అయినా నీళ్లు సరపడవని నీళ్లు సక్రమంగా అందేలా చూడాలని పంచాయతీ అధికారులను, గ్రామ సర్పంచ్‌ను విద్యార్థులు కోరుతున్నారు.

ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

నది ప్రవాహాన్ని పరిశీలించిన పీఠాధిపతులు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వెనక ప్రవహిస్తున్న తుంగభద్రనది వరద నీటి ప్రవాహాన్ని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పరిశీలించారు. ఆదివారం వరదనీటితో తుంగభద్ర నది జల కళ సంతరించుకున్న నేపథ్యంలో నదీతీరం చేరుకున్న ఆయన నదిలో దిగి నదీమ తల్లి జలాలను తలపై వేసుకుని భక్తులకు కూడా వేశారు. నదీ తీరంలో ఉన్న షవర్ల ద్వారా భక్తులు పవిత్ర స్నానాలు చేయాలని ఎవరూ కూడా నదిలోకి వెళ్ళకుండా శ్రీ మఠం సెక్యూరిటీ చూడాలని ఆదేశించారు. ఆయన వెంట శ్రీ మఠం సిబ్బంది పండితులు వాదిరాజాచార్ వెంకటేషాచార్ పురాణిక రాఘవేంద్ర చార్ దేశాయ్ వాజీంద్రాచార్ తదితరులు ఉన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి

ప్రజాశక్తి - కౌతాళం

కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆదోని డిఎస్పి శివ నారాయణ స్వామి పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆదోని డిఎస్‌పి శివనారాయణ స్వామి, కోసిగి సిఐ ప్రసాద్, కౌతాళం ఎస్సై నరేంద్రకుమార్ కుమార్ రెడ్డి పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఐపిసి, సిఆర్‌పిసి చట్టాల స్థానాలలో మార్పులు జరిగాయన్నారు. వాటికి అనుకూలంగా బిఎం.ఎస్, బిఎన్ఎస్ఎస్, భారతీయ సాక్ష్యా అదినయయం చట్టాలు అమల్లోకి రావడం వచ్చాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టడం ద్వారా వారు అవగాహన కలిగి ఇతరులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకరన్, టిడిపి నాయకులు సతీష్ నాయుడు, వెంకటపతి రాజు, కాశీ విశ్వనాథ్, వీరేష్, వైసిపి నాయకులు ఏకం రెడ్డి, అవతారం, సిపిఎం నాయకులు మల్లయ్య, రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, ఇతర ప్రజాసంఘా నాయకులు, అంగన్వాడీ టీచర్లు, వివిధ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. **ఆదోని రూరల్ :** భారతీయ నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇస్వి ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. **దేవనకొండ :** చట్టం దృష్టిలో అందరూ సమానులే అని, చట్టానికి లోబడి గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత జీవనం కొనసాగించాలని స్థానిక సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు మనస్పర్థలను మనసులో ఉంచుకొని ఘర్షణలు చేసుకోరాదని సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. **మంత్రాలయం :** భారత శిక్షా స్మృతిలో వచ్చిన కొత్త చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ గోపినాథ్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్టేషన్ ఆవరణంలో అవగాహన కల్పించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని ఐపిసి (ఇండియన్ పీనల్ కోడ్)ను బిఎన్ఎస్ (భారతీయ న్యాయ సన్హిత గాను, (సిఆర్పిసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)బిఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక సురక్ష సన్హిత గాను, ఐఇఎ (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్) ను భారతీయ సాక్ష్య అధినీయం పేరు చేశారని పేర్కొన్నారు. ఈ మార్పుల వల్ల సెక్షన్లు కూడా మారాయని చెప్పారు. వీటిని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలి తెలిపారు. పోలీసు సిబ్బంది చెన్నబసప్ప, రామాంజనేయులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి

తూతూమంత్రంగా ఆధార్ ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి-ఆదోని రూరల్

జులై 23 నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్ కార్డు అప్ డేట్ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. జులై 23 నుంచి 27 వరకూ ఏపీ వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ కార్డు అప్ డేట్ కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా నూతన ఆధార్ కార్డులు నమోదు సహా ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు. అయితే అందుకు భిన్నంగా, పట్టణ గ్రామీణ ప్రాంతాలలో తూతూ మంత్రంగా ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క పంచాయతీలో మాత్రమే ఆధార్ ఆప్‌డేట్ చేస్తున్నారు. చాలా మంది ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. అయితే వారికి సమాచారం లేక సచివాలయానికి రాలేదు. ఈ కార్యక్రమాన్ని కనీసం నాలుగు రోజులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామస్థులు కోరుతున్నారు. ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటం, సచివాలయంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో చాలా సమయం నిరీక్షించాల్సి వస్తుందని వివిధ గ్రామస్తులు తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించండి

- ఏరూరు విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల పరిధిలోని ఏరూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకులను నియమించి విద్యార్థుల ఉత్తీర్ణత పెరగడానికి సహకరించాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు ఏరూరు గ్రామ ప్రజలు కోరుతున్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లేని కారణంగా ఉపాధ్యాయుడే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ప్రధానోపాధ్యాయుడు కు సంబంధించిన విధులు కూడా నిర్వర్తిస్తున్నాడు. విద్యార్థులకు పూర్తి సమయము కేటాయించలేకపోతున్నారని, ఉన్నత అధికారులు వెంటనే స్పందించి ప్రధానో పాధ్యాయుడును నియమించాలని, అలాగే ఖాళీగా ఉన్న ఇంకో పోస్టును భర్తీ చేసి విద్యార్థుల ఉత్తీర్ణతకు సహకరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండకు చెందిన పింజరి దస్తగిరి అనే వ్యక్తి అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి వెళ్ళాడని, బంధువుల గ్రామాల్లో కూడా విచారించగా ఎక్కడ ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. అదృశ్యమైన వ్యక్తిని గుర్తించాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఎంహెచ్‌పిఎస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ఆదోని

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి బలోపేతానికి నాయకులు నిరంతం కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదోనిలోని ఎంహెచ్‌పిఎస్ కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్న బుద్దిస్ట్, మైనార్టీ జిల్లా కార్యదర్శి హెచ్ రామలింగయ్యకు శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైకాపా ప్రభుత్వ పాలనలో జగన్ రెడ్డి, నాయకలు దోచుకున్న ప్రజా ధనాన్ని స్వాధీనం చేసుకొని ప్రజల అభివృద్ధికి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హసన్, వసీమ్ సాహెబ్, షకీల్, సద్దాం పాల్గొన్నారు.

ప్రతాప్ స్వామికి సన్మానం

ప్రజాశక్తి - ఆదోని : పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆదోనిలోని లలిత కళా సేవా సంస్థ కార్యాలయంలో అధ్యక్షుడు నల్లారెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్న ప్రతాప్ స్వామిని ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరు చెట్లను నాటేందుకు ముందుకొచ్చినప్పుడే సామాజం ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నందని సన్మానకర్త ప్రతాప్ స్వామి అన్నారు. అదేవిధంగా వృద్ధుల దినోత్సవం పురస్క రించుకొని సంగీత విద్వాంసులు రాతన అబ్దుల్లా, దాసరి లక్ష్మయ్యను కూడా సన్మానించారు.

ఎస్టీయు రాష్ట్ర సభ్యులుగా మహాదేవప్ప

ప్రజాశక్తి - ఆదోని : ఎస్టీయు రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులుగా ఆదోనికి చెందిన మహాదేవప్ప ఎన్నికపై ఆదోని, కౌతాలం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు సి రామకృష్ణ, బి సుధాకర్ బాబు, కె గురుసాగర్, బి తాయన్న, యస్ ఖాదర్ బాష హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆదోనిలోని ఎస్టీయు కార్యాలయంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిలర్‌గా ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎస్టీయు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి యం.సి.సుంకన్న మాట్లాడారు. కార్యక్రమంలో బి.గోపాల్, జిల్లా కార్యదర్శి బి.రామాంజినేయులు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు పి. షేక్షావలి, పి అంజనయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT. AT HYDERABAD
O.S.NO.1868 OF 2023

Between:
Union Bank of India, (erstwhile Andhra Bank merged in UBI) Credit Card Division, Koti, Hyderabad, represented by the Manager ...**Plaintiff**

And

Sri Konkineni Venkateswara Rao@ K.V. Rao, S/o father Name not know to the plaintiff, aged about 46 years, R/o Plot No. 106, Seshi Kanth Mansion, Ganesh Nagar, Kurnool- 518002 ...**Defendant**

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.3,39,223.50Ps. (Rupees Three Lakh Thirty Nine Thousand Two Hundred Twenty Three and Fifty Paise only) with subsequent interest @ 2.95% per month compounded monthly and service charges from date of suit till realisation and costs and the same stands posted to 06-08-2024 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/-(S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanthnagar Colony, Moosarambagh, Hyderabad-500036